

బీఆర్ఎస్ పార్టీలో చేరిన చిట్యాల ఆటో యూనియన్ సభ్యులతో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

# అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరికలు

**● మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**

మెదక్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్శితులై బీఆర్ఎస్ పార్టీలోకి చేరుతున్నారని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం మెదక్ మండలంలోని 'చిట్యాల ఆటో యూనియన్' సభ్యులు, వివిధ పార్టీలకు చెందిన కొంతమంది యువకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నియోజకవర్గానికి చేస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరుతున్నామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు గంజయి మల్లేశం, సోంపు మల్లేశం, సన్నం బాలరాజు, యాదగిరి, నజీర్, సుధాకర్, ఆనంద్, స్వామి, మోహన్, భాస్కర్, బిక్షపతి, దేవయ్య, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# 'గృహలక్ష్మి' ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలి

**● గృహలక్ష్మి లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలి: కలెక్టర్ రాజర్షి షా**

మెదక్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): 'గృహలక్ష్మి' లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సముదాయంలోని వీడియో సమావేశ మందిరంలో గృహలక్ష్మి నోడల్ అధికారులు, ఎంపీడీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గృహలక్ష్మి పథకానికి కావలసిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అధికారులు అలసత్వం లేకుండా అర్హులైె వ్యక్తులకు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని, గృహలక్ష్మి లబ్ధిదారుల వివరాలను ప్రత్యేక యాప్‌లో శాఖ అధికారులు, ఎంపీడీవోలు నమోదు చేయాలన్నారు. జిల్లాలోని ఆయా గ్రామాల్లో వచ్చిన దరఖాస్తులన్నీ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులతో కలిసి వెరిఫికేషన్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని ఆదేశించారు. లబ్ధిదారులకు ప్రత్యేక అకౌంట్లు తెరిపించాలన్నారు. గృహలక్ష్మి మంజూరు ఉత్తర్వులను నియోజకవర్గం వారీగా సిద్ధం చేయాలన్నారు. మంజూరు ఉత్తర్వులు అందించిన వెంటనే ఇంటి నిర్మాణాలను వివిధ దశల్లో సంబంధిత అధికారులు జియో ట్యాగింగ్ చేసి లబ్ధిదారులకు బిల్లులు అందజేయాలన్నారు. సమీక్షలో స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ రమేశ్, డీఆర్‌వో పద్మశ్రీ, జెడ్పీ సీఈవో శైలేశ్ కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం కృష్ణమూర్తి, మెదక్ మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

## మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ

చిలిపిచెడ్, సెప్టెంబర్ 30: మార్షల్ ఆర్ట్స్‌లో రాణిస్తే శారీరక, మానసిక దృఢత్వం ఏర్పడడంతోపాటు విద్యార్థులు భవిష్యత్తులో మంచి విజయాలను సాధిస్తారని సోమక్కపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విఠల్ అన్నారు. మండలపరిధిలోని సోమక్కపేట ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు శృతి, దీపిక, శ్రీవాణి ఇటీవల సంగారెడ్డి జిల్లా కేంద్రంలో వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన రాష్ట్రస్థాయి బెల్ట్ ఎగ్జామ్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారు.అనంతరం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చేగుంట ప్రభుత్వ కళాశాలలో స్వచ్ఛభారత్

చేగుంట, సెప్టెంబర్ 30: మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకొని శనివారం చేగుంటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ హరిప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్‌ను నిర్వహించారు. కళాశాల ఆవరణలో పిచ్చిమొక్కలను తొలిగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రమీలారాణి, స్వర్ణలత, ఫర్జానా, ఎన్ఎస్ఎస్ ప్రోగాం ఆఫీసర్ ప్రమోద్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు

## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

నిజాంపేట,సెప్టెంబర్ 30: మండలంలోని బచ్చురాజ్‌పల్లికి చెందిన నక్క సత్తవ్వ (60) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి శనివారం బీఆర్ఎస్ నేత నరేందర్ ద్వారా బాధిత కుటుంబసభ్యులకు అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సవ్వ, ఉపసర్పంచ్ మల్లేశం, బీఆర్ఎస్ నాయకులు సుదాం మల్లేశం, రాజు, యాదగిరి, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.


బ్యాంకు సేవలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

## బ్యాంకు సేవలపై అవగాహన

రామాయంపేట రూరల్, సెప్టెంబర్30: రామాయంపేట మండలం సుతారిపల్లిలో 'రామాయంపేట ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్' అధికారులు బ్యాంకు సేవలను కళాకారులతో ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం బ్యాంక్ అధికారులు గ్రామంలో కళాజాతతో బ్యాంక్‌ల నుంచి పొందే సేవలను, పంటల రుణమాఫీ విషయంలో రైతుల సందేహాలను గ్రామస్తులకు నివృత్తి చేశారు. అలాగే వ్యక్తిగత ప్రమాద బీమా, అటల్ పెన్షన్ యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజనపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంక్ వివరాలు అడిగితే చెప్పవద్దని, ఎలాంటి సందేహాలు ఉన్నా నేరుగా బ్యాంక్‌కు వచ్చి తెలుసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న క్రమంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కళాకారులు సూచించారు.


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భిక్షపతి

## రామాయంపేటను ఆదర్శంగా అభివృద్ధి చేద్దాం

**● మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ భిక్షపతి, ఎంపీడీవో ఉమాదేవి**

రామాయంపేట, సెప్టెంబర్ 30: ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి నాయకత్వంలో రామాయంపేట మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి పర్చుకుందామని ఎంపీపీ నార్సింసేట భిక్షపతి, ఎంపీడీవో ఉమాదేవి పేర్కొన్నారు. శనివారం రామాయంపేట ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారి రాజ్‌నారాయణ మాట్లాడుతూ మండలంలో వ్యవసాయానికి సంబంధించిన విత్తనాలు, ఎరువులు రైతులకు సిద్ధంగా ఉన్నాయన్నారు. వైద్యులు మాట్లాడుతూ ప్రతి మంగళవారం గ్రామాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలను నిర్వహిస్తామన్నారు. డీ.ధర్మారం, రామాయంపేట ఆరోగ్య కేంద్రాల్లో 54 రకాల వైద్య పరీక్షలను చేస్తున్నామన్నారు. పింఛన్ల విషయమై సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడమని ఎంపీడీవో తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులతో సర్పంచులంతా అప్రమత్తంగా ఉండాలని రామాయంపేట ఎంపీపీ భిక్షపతి, ఎంపీడీవో ఉమాదేవి సూచించారు. హరితహారంలో ప్రతి ఇంటికీ మొక్కలను అందించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముస్కుల స్రవంతి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, పంబాల జ్యోతి, పాకాల లత, బుజ్జి, భాగ్యమ్మ, మల్లన్నగారి నాగులు, జ్యోతి, శ్యాములు, సుభాశ్, సంధ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## అసైన్‌మెంట్ భూములకు రుణాలిచ్చేలా చర్యలు

**● మహాజన సభలో సొసైటీ చైర్మన్ కృపాకర్‌రెడ్డి**

కొల్చారం, సెప్టెంబర్ 30: అసైన్‌మెంట్ భూములకు రుణాలిచ్చేలా కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశామని, సమస్యను ప్రభుత్వానికి నివేదించి పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారని కొంగోడు సొసైటీ చైర్మన్ కృపాకర్‌రెడ్డి తెలిపారు. కొల్చారం మండలం కొంగోడు సొసైటీ మహాజన సభ శనివారం చైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కొంగోడు, నాయిన్‌జలాల్‌పూర్ గ్రామానకు చెందిన రైతులు గతంలో అసైన్‌మెంట్ భూములకు రుణాలిచ్చేవారని, ఇప్పుడు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. చైర్మన్ మాట్లాడుతూ.. ధరణిలో లావణి పట్టాలకు 'బి'ఫారం కావడం లేదని, బ్యాంకర్లు రుణాలు ఇవ్వలేకపోతున్నారన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే అన్ని సొసైటీల చైర్మన్లు, పలువురు సర్పంచ్‌లు కలెక్టర్‌ను కలిశామని, అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తున్నందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. అసైన్‌మెంట్ భూములకు రుణాలివ్వాలని మహాజన సభ తీర్మానించింది. కార్యక్రమంలో సీఈవో సాయిరెడ్డి, వైస్‌చైర్మన్ గంపల లక్ష్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సత్యనారాయణగౌడ్, డైరెక్టర్లు అంబరీశ్, మాణయ్య, గోపాల్, పాండరి, శేషగిరి రైతులు పాల్గొన్నారు.


కొల్చారం: కొంగోడు మహాజనసభలో మాట్లాడుతున్న చైర్మన్ కృపాకర్‌రెడ్డి

## ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు

రామాయంపేట, సెప్టెంబర్ 30: రామాయంపేట పట్టణంలోని కల్యాణ రామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి శుక్రవారం రూ.10 లక్షల నిధులను మంజూరు చేశారు. నిధులు మంజూరు కావడంతో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పుట్టి అక్షయ్‌కుమార్, దామరచెర్వు సర్పంచ్ పడాల శివకుమార్, నక్క సిద్ధరాములు శనివారం పనులను ప్రారంభించారు. గత బ్రహ్మోత్సవాలకు హాజరైన సందర్భంగా ఎమ్మెల్సీ ఇచ్చిన హామీ మేరకు తన నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేశారు. మరి కొద్దిరోజుల్లో పనులు కూడా పూర్తి చేస్తామని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పటేరి రవీందర్, సాంగని బస్వరాజు, నవాత్ ప్రభాకర్, మదునాల చిన్న రామగౌడ్, నవాత్ కిరణ్‌కుమార్ నాగరాజు, శ్రీనివాస్, బంగారయ్య, పూజారులు సత్యనారాయణ, కూర్మాచలం రాఘవేంద్ర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంటరానితనాన్ని నిర్మూలిద్దాం

నిజాంపేట, సెప్టెంబర్ 30: అంటరానితనాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నిజాంపేట ఆర్ఐ గంగాధర్‌గౌడ్ ప్రజలకు సూచించారు. శనివారం మండలంలోని కల్వకుంట ఎస్సీ కాలనీలో నిర్వహించిన 'పౌరహక్కుల దినోత్సవం'లో ఆర్ఐ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలను కులం పేరిట అగౌరవంగా మాట్లాడిన, వివక్షత చూపిన చట్టరీత్యా నేరమని, గ్రామాల్లో ప్రజలంతా కలిసి మెలిసి సోదరభావంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కవిత, కాలనీవాసులు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గుర్తుతెలియని శవం లభ్యం

నర్సాపూర్, సెప్టెంబర్ 30: మున్సిపల్ పరిధిలోని రాయారావు చెరువులో శనివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్సై శివకుమార్ కథనం ప్రకారం.. సుమారు 38ఏండ్ల వయస్సు ఉన్న పురుషుడి శవం రాయారావు చెరువులో లభించిందని, మృతుడి ఒంటిపై తెల్లని బనియన్, పర్పుల్ రంగు షర్ట్, నలుపు రంగు ప్యాంటు, నడుముకు నల్లని బెల్టు ధరించి ఉన్నాడని, ఎత్తు సుమారు 5.4, చామనఛాయ రంగు, గుండ్రటి మొఖం కలిగి ఉన్నాడని తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే 8712657940, 8712657941 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై శివకుమార్ వెల్లడించారు.



## చట్టాలపై అవగాహన ఉండాలి

పాపన్నపేట, సెప్టెంబర్30: ప్రతి ఒక్కరు చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి సూచించారు. శనివారం రాత్రి పాపన్నపేట మండల పరిధిలోని మిన్‌పూర్ గ్రామంలో మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 'కార్డన్ సెర్చ్' నిర్వహించారు. కార్యక్రమంలో పాపన్నపేట, మెదక్, హవేళి ఘనపూర్, కొల్చారం ఎస్ఐలు, ఆయా పోలీస్ స్టేషన్‌ల సిబ్బంది, సర్పంచ్ లింగారెడ్డి, ఎంపీటీసీ కుబేరుడు పాల్గొన్నారు.



## కుల వివక్ష పాటిస్తే కేసులు

చిలిపిచెడ్, సెప్టెంబర్ 30: కుల వివక్ష పాటిస్తే చట్టపరంగా కేసులు తప్పవని, ప్రజల ఐకమత్యానికి కులం అడ్డు కాకూడదని ఏఎస్సై మిస్బొద్దీన్ అన్నారు. శనివారం మండల పరిధిలోని చిట్కుల్‌లో గ్రామస్తులతో కలిసి పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలను అంటరానితనం, ఆలయాల ప్రవేశం, పెన్షన్లు తదితరలు వివరాల గురించి వారిని ఆడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశం, గ్రామ కార్యదర్శి తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.